సాక్షి
విశాఖపట్నం
గురువారం । 24 । అక్టోబర్ । 2024



మద్యం షాపు వద్దు

తమ ప్రాంతంలో వైన్ షాపు ఏర్పాటును నిరసిస్తూ పందిమెట్ట జంక్షన్ వద్ద స్థానికులు ఆందోళనకు దిగారు. 8లో



రూ.20 కోట్లకు టోకరా

తగరపువలసకు చెందిన భార్యాభర్తలు రోజా, శ్రీనివాసరావు బీటీల పేరుతో రూ.20 కోట్లకు టోకరా వేశారు. 8లో



పీరియాడికల్ థ్రిల్లర్‌గా 'క'

'క' చిత్రం ఈ నెల 31 విడుదలవుతుందని, ప్రేక్షకులు ఈ సినిమాను విజయవంతం చేయాలని హీరో కిరణ్ కోరారు. 8లో

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్ కోసం పోరాటం కొనసాగిస్తాం..

- అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా..
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన తరువాత బుధవారం తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయన ఎయిర్‌పోర్టులో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం పార్టీ నేతలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. అవసరమైతే తాను ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు. దసపల్లా భూములు, ఎన్‌సీసీ భూములు, మరే ఇతర భూముల విషయంలోనైనా తాను విచారణకు సిద్ధమని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియాతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఎయిర్‌పోర్టులో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, చింతలపూడి వెంకట్రామయ్య, ముస్లిం మైనార్టీ నాయకుడు ఫరూఖీ, ముఖ్యనేతలు గొలగాని శ్రీనివాస్, ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు భార్యకు చెక్కు అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: అకాల మరణం చెందిన హోంగార్డు కుటుంబానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆర్థిక సాయం అందించడంతో పాటు అతని భార్యకు కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. నగర పోలీస్ శాఖలో మహమ్మద్ హాసం హోంగార్డుగా విధులు నిర్వర్తించి న్యూరో సమస్యతో ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన మరణించారు. దీంతో కాంట్రిబ్యూషన్ ఫండ్ నుంచి సదరు హోంగార్డు భార్య జరీనా కౌసర్‌కు ఆర్థిక సహాయం కింద చెక్కుతో పాటు కారుణ్య నియామక పత్రాన్ని సీపీ చేతుల మీదుగా అందజేశారు.

పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా గిరిజాశంకర్



గిరిజాశంకర్‌కు గెజిట్ నోటిఫికేషన్‌ను అందజేస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: రాష్ట్ర స్థాయి పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్ నియమితులయ్యారు. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఈయనను నామినేట్ చేశాయి. మూడేళ్ల పాటు గిరిజాశంకర్ ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సందర్భంగా ఆచార్య గిరిజాశంకర్‌ను ఏయూ వీసీ జి.శశిభూషణరావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

మహారాణిపేట: జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి గురువారం విశాఖ రానున్నారు. రాత్రి ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారు.

మీ నైపుణ్యానికి సలామ్







అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని ప్రజ్వల్ వాణీ వెల్ఫేర్ సొసైటీలో శిక్షణ పొందుతున్న దివ్యాంగులు దీపావళికి మట్టి ప్రమిదలను తయారు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. వాటికి రంగులు అద్ది, కుందన్‌లతో అలంకరించి అద్భుతమైన కళాఖండాలను సృష్టించారు. శారీరక వైకల్యమైనా.. మానసిక వైకల్యమైనా.. ఇది తలరాత అని చింతించాల్సిన అవసరం లేదని నిరూపిస్తూ.. భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకురాలు సుచిత్రారావు మాట్లాడారు. 'ఏటా దీపావళి సందర్భంగా దివ్యాంగ పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు పెంపొందించే ఉద్దేశంతో ప్రమిదలను తయారు చేయిస్తున్నాం. ఈ సారి కూడా దివ్యాంగులు ఎంతో ఆసక్తితో ప్రమిదలు తయారు చేశారు. ఈ ప్రమిదలను నగరంలోని మాల్స్, బీచ్‌రోడ్ గేటెడ్ కమ్యూనిటీల్లో విక్రయిస్తాం. ఆ విధంగా వచ్చిన డబ్బులను ధన్‌తేరస్ రోజున వారి తల్లిదండ్రులకు అందజేస్తాం. ఇది వారికి ఎంతో ఆనందాన్ని ఇస్తుంది.' అని తెలిపారు. అనంతరం దివ్యాంగులు తయారు చేసిన ప్రమిదలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కళాకృతులను చూసిన ప్రతి ఒక్కరూ వారి ప్రతిభను అభినందించారు. ఎంతో ఓపికతో నైపుణ్యత సాధించిన దివ్యాంగుల సంకల్పానికి ఎవరైనా సలాం కొట్టాల్సిందే.! – సీతంపేట

నీ ధైర్యానికి హ్యాట్సాఫ్



ప్రస్తుత సమాజంలో పదుల వయస్సులోనే ఎంతో మంది మంచానికి పరిమితమవుతున్న రోజులివి. అలాంటిది వందేళ్లు దాటిన ఓ వృద్ధుడు తన పనులు చేసుకోవడంతో పాటు చేతివృత్తిని కొనసాగిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. దొండపర్తి ప్రాంతానికి చెందిన శ్రీకాకుళం పరదేశి(103) కుమ్మరి పనినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఉదయం చద్దన్నం తిని కుమ్మరి పనిని ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటల వరకు... మళ్లీ 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. ఏకధాటిగా కుండలు, ప్రమిదలు, మట్టి పాత్రలను తయారు చేస్తూ ఉన్నారు. వందేళ్లు పైబడినా ఎవరిపై ఆధారపడకుండా పనే దైవంగా భావించి ముందుకు సాగుతున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం వరకు పనిలోనే ఆనందం దొరుకుతుందని పరదేశి చెబుతున్నారు. దీపావళి సందర్భంగా చిచ్చుబుడ్డీలు, ప్రమిదలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నాడు. – విశాఖ సిటీ

పర్యాటక స్థలంపై కన్ను

ఓం.. హ్రీం.. క్లీం.. సర్కారు భూమి హాంఫట్.. విశాఖలో టీడీపీ నేతలు జపిస్తున్న మంత్రమిది. భూమి ఏదైనా.. ఎక్కడిదైనా.. ఎవరి పేరుతో ఉన్నా.. తమ మాయోపాయంతో కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. అధికారం చేతిలో ఉంటే.. కనిపించిన భూమంతా తమదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా రూ.10 కోట్లు విలువ చేసే పర్యాటక భూమిని ఎమ్మెల్యే వెలగపూడి అనుచరుడు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కోర్టు కేసుతో ఉలిక్కిపడ్డ టూరిజం అధికారులు.. తమ భూమిని కాపాడుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

– సాక్షి, విశాఖపట్నం

- 600 గజాల టూరిజం భూమి తనదంటూ కోర్టులో కేసు
- 1979లో ఇదే స్థలంలో రెస్ట్‌రూమ్‌లు నిర్మించిన ఏపీటీడీసీ
- కొత్త నిర్మాణాలకు భూమిని చదును చేసిన అధికారులు
- ఇదే అదనుగా ఆ భూమి తనదంటూ కోర్టుకెళ్లిన టీడీపీ నేత



ఇదీ భూమి కథ

చినవాల్తేరు లాసన్స్ బే కాలనీలోని యోగాశ్రమం సమీపంలో సర్వే నం 51–3లో 600 గజాల స్థలం ఉంది. ఇది 1971 నుంచి పర్యాటక శాఖ అధీనంలోనే ఉంది. ఇందులో విశాఖ వచ్చే సందర్శకులకు ప్రాథమిక సౌకర్యాలు అందించేందుకు రూ.1.78 లక్షల వ్యయంతో 1979లో డ్రెస్ చేంజ్ రూమ్‌లు, రెస్ట్ రూమ్‌లు నిర్మించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నిర్మాణాలు చేపట్టారు. పక్కా భవనంతో ఈ నిర్మాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏపీ టూరిజం అథారిటీ 1980లో ఈ నిర్మాణాలతో కూడిన స్థలాన్ని ఏపీ ట్రావెల్స్ అండ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ)కి అప్పగిస్తూ జీవో నంబర్ 203ని విడుదల చేసింది. అప్పటి నుంచి ఈ 600 గజాల స్థలం ఏపీటీడీసీ ఆధీనంలోనే ఉంది.

కొత్త నిర్మాణాలకు స్థలం చదును

1985 నాటికి ఇందులోని నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మంచినీటి మోటార్ పనిచేయకపోవడం, గదులు శిథిలమైపోవడంతో వీటిని వినియోగించకుండా పక్కన పెట్టారు. ఇక్కడ చిన్న చిన్న గదులు ఉండటంతో 1984 నుంచి 2000 వరకు ఈ నిర్మాణాలకు సంబంధించి జీవీఎంసీకి మున్సిపల్ రికార్డుల ప్రకారం అసెస్‌మెంట్ నం.37,370 కింద ఏపీటీడీసీ పన్ను చెల్లిస్తోంది. అయితే శిథిల భవనాల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ఇటీవల ఏపీటీడీసీ సన్నద్ధమైంది. ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని ఏపీటీడీసీకి చెందిన వాహనాలు పార్కింగ్ చేసేందుకు వినియోగించారు. ఇప్పుడు శిథిల గదుల నిర్మాణాలు తొలగించి చదును చేశారు. కొత్త నిర్మాణాల కోసం సిద్ధం చేశారు.

కబ్జాకు వెలగపూడి అనుచరుడి యత్నం

భూమిని సిద్ధం చేసిన తర్వాత దీనిపై టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి అనుచరుడి కన్ను పడింది. బీచ్‌కు సమీపంలో.. హాట్‌కేక్‌లాంటి ఆ స్థలాన్ని వదులుకోకూడదని భావించాడు. అంతే ఆ భూమిపై సర్వ హక్కులు తనవేనంటూ కోర్టును ఆశ్రయించాడు. ఇది యోగాశ్రమానికి చెందిన దివంగత రాఘవేంద్ర స్వామి నుంచి గిఫ్ట్ డీడ్‌గా పొందానంటూ.. ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్‌కు వ్యతిరేకంగా కేసు వేశాడు. పక్కాగా డాక్యుమెంట్లు ఉన్నా.. దశాబ్దాల నుంచి ఆ స్థలంలో పర్యాటక కార్యకలాపాలు సాగిస్తున్నా.. హఠాత్తుగా ఈ స్థలం తనదంటూ టీడీపీ నేతలు రావడంతో టూరిజం అధికారులు కంగుతిన్నారు.

సాక్ష్యాల సేకరణ

వాస్తవానికి ఈ స్థలం దివంగత రాఘవేంద్రస్వామిదే. అయితే రాఘవేంద్రస్వామి ఈ స్థలాన్ని ఏపీఎస్ఆర్‌టీసీకి గిఫ్ట్‌గా అందించారు. ఆ భూమిని ఏపీఎస్ఆర్టీసీ 1971లో పర్యాటక శాఖకు అప్పగించింది. ఇన్నాళ్లూ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ భూమి ఉంటే.. పత్తా లేని ఆ టీడీపీ నేత.. హఠాత్తుగా ఈ భూమి తనదంటూ కబ్జా చేసేందుకు యత్నించడం గమనార్హం. దీనిపై కోర్టులో రెండు రోజుల్లో విచారణ జరగనుంది. ఈ స్థలం ఎప్పటి నుంచి టూరిజం ఆధీనంలో ఉంది. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఫొటోలు, మ్యాప్‌లు.. అన్నీ రెవెన్యూ విభాగం సహకారంతో పర్యాటక అధికారులు సేకరించారు. ఈ భూమిని కబ్జా కాకుండా కాపాడుకోవాలని నిర్ణయించారు. మరోవైపు తన అనుచరుడి కబ్జా పర్వానికి ఎలాంటి ఆటంకం కలగనీయకుండా చూడాలంటూ.. ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆస్ట్రేలియా టూర్‌కు రికీ, నితీష్

భారత్ ఏ జట్టుకు ఎంపిక



రికీబుయ్



నితీష్‌కుమార్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ కుర్రాళ్లు రికీబుయ్, నితీష్‌కుమార్ రెడ్డి భారత్ ఏ జట్టుకు ఎంపికయ్యారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ జట్టు ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. నవంబర్ 22 నుంచి జనవరి 8వ తేదీ మ్యాచ్‌లు జరగనున్నాయి. టూర్‌లో భాగంగా ఆస్ట్రేలియా ఏ జట్టుతో భారత్ ఏ జట్టు రెండు అనధికార నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌లను ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌లకు ఆంధ్రా కెప్టెన్ రికీబుయ్, ఆల్‌రౌండర్ నితీష్‌కుమార్‌రెడ్డి అవకాశం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీఏ కార్యదర్శి సతీష్‌బాబు వీరిద్దరిని అభినందించారు. భారత్ ఏ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వం వహించనున్నాడు.

30 సెకన్లు.. 184 పంచ్‌లు

- బాక్సింగ్‌లో కనకారావు అరుదైన రికార్డ్
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



మధురవాడ: పీఎం పాలెం డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు పెదిరెడ్ల కనకారావు అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ విభాగంలో 30 సెకన్లలో బాక్సింగ్ గ్లౌజులు ఉపయోగించి.. 184 పంచ్‌లు విసిరి ప్రపంచ రికార్డును సృష్టించారు. దీంతో అతనికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఆగస్టులో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో కనకారావు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులకు పంపించారు. ఈ ఫీట్‌ను రికార్డ్‌గా గుర్తించి నిర్వాహకులు కనకారావును అభినందించి తమ బుక్‌లో పేరు నమోదు చేశారు. ఈ రికార్డ్స్‌కు సంబంధించి సర్టిఫికెట్, మెడల్, ట్రోఫీని బుధవారం ఆయన అందుకున్నారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన బాక్సర్లు ఆయన్ని అభినందించారు.

3 నుంచి ఆర్టీసీ 'పంచారామ దర్శిని'



దాబాగార్డెన్స్: పవిత్ర కార్తీకమాసంలో ఒకే రోజున పంచారామాలను దర్శనం చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నవంబర్ 3, 10, 17, 24వ తేదీల్లో వచ్చే ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడపనుంది. అమరేశ్వర స్వామి(అమరావతి), సోమేశ్వరస్వామి(భీమవరం), క్షీర రామలింగేశ్వరస్వామి(పాలకొల్లు), భీమేశ్వరస్వామి(ద్రాక్షారామం), కుమార రామలింగేశ్వరస్వామి(సామర్లకోట)ని ఒకే రోజు దర్శనాలు చేసుకునేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.2,100, ఇంద్ర ప్రయాణ చార్జీ రూ.2,600గా నిర్ణయించారు.

లంబసింగి టూర్ : కార్తీక మాసం పురస్కరించుకుని పిక్నిక్‌లకు లంబసింగి వెళ్లే పర్యాటకులకు శని, ఆది వారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి, కాఫీ ప్లాంటేషన్ చూపిస్తారు. ఒక్కొక్కరికి అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.800, ఎక్స్‌ప్రెస్ ప్రయాణ చార్జీ రూ.650.

ధారమట్టం టూర్ : ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. శివాలయం, ధారమట్టం వాటర్‌ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జనకొండ(అనకాపల్లి) చూపిస్తారు. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.650, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.550.

విజ్ఞాన విహార యాత్రలకు.. : కార్తీక మాసంలో విజ్ఞాన విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇవ్వనున్నట్టు అప్పలనాయుడు తెలిపారు. ప్రయాణికులు గ్రూపుగా సంప్రదిస్తే వారు కోరిన రోజున టూర్ స్పెషల్స్ నడుపుతామన్నారు.

సంప్రదించండి ఇలా..

పంచారామ దర్శిని, పిక్నిక్‌లు, మార్గశిర మాసంలో పంచవైష్ణవి క్షేత్ర దర్శనాల కోసం వెళ్లే భక్తులు www.apsrtconline.in ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని అప్పలనాయుడు తెలిపారు. ద్వారకాబస్టేషన్ వద్ద గల రిజర్వేషన్ కౌంటర్లలో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083, 99592 25594, 91001 09731లో సంప్రదించవచ్చు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తెలిపారు. డీఎస్సీకి సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ అందిస్తున్న విషయం తెలిసిందే. గతంలో ప్రకటించిన దరఖాస్తు గడువు 21వ తేదీతో ముగియడంతో ఈ నెల 25 వరకు మరోసారి పొడిగించారు. దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం అభ్యర్థుల ఎంపికకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రామారావు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఒకేరోజు ఈ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు వారి ఆసక్తికి అనుగుణంగా వివిధ జిల్లాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. విశాఖ జిల్లాలో 100 మంది వరకు శిక్షణ కోసం ఎంపిక చేస్తామన్నారు.

మరిన్ని రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం: దానా తుపాను కారణంగా వాల్తేర్ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

24న రద్దయిన రైళ్లు : ఎస్ఎంవీటీ బెంగళూరు–హౌరా (22888) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–హౌరా(18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్..

25న రద్దయిన రైళ్లు : ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(12839) సూపర్‌ఫాస్ట్, గుణుపూర్–కటక్(08422) మెము, భువనేశ్వర్–విశాఖపట్నం (20841) వందేభారత్, భువనేశ్వర్–సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–కేఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–రామేశ్వరం(20896) ఎక్స్‌ప్రెస్, పూరీ–యశ్వంత్‌పూర్ (22883)గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్

26న రద్దయిన రైళ్లు : పూరీ–గాంధీదాం(22974) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిల్చార్(12513) ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్–పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, మంగళూరు సెంట్రల్–సంత్రగచ్చి(22852)వివేక్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు–కామాఖ్య (12551) ఏసీ ఎక్స్‌ప్రెస్, తిరుపతి–పూరీ(17480) ఎక్స్‌ప్రెస్

27న రద్దయిన రైళ్లు : రామేశ్వరం–భువనేశ్వర్(20895) ఎక్స్‌ప్రెస్, వాస్కోడిగామా–షాలిమర్(18048)అమరావతి, గౌహతి–ఎస్ఎంవీటి బెంగళూరు(12510) ఎక్స్‌ప్రెస్ – 29న మాల్దా టౌన్–సికింద్రాబాద్(03430) ఎక్స్‌ప్రెస్ రద్దయింది.

మైసూర్ కార్పొరేషన్‌ను సందర్శించిన కార్పొరేటర్లు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం బెంగళూరు నుంచి మైసూరు వెళ్లారు. మైసూర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులపై అవగాహన పొందారు. అనంతరం స్థానికంగా ఉండే సందర్శన స్థలాలు సందర్శించారు. యాత్రలో భాగంగా గురువారం మైసూర్ నుంచి బంధీపూర్ అభయారణ్యాంను సందర్శించనున్నారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్ : దివ్యాంగురాలైన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి మూడేళ్ల జైలు, రూ.30,000 జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే ఆరు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివీ.. దివ్యాంగురాలై బాలిక అనకాపల్లి జిల్లా రోలుగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని జేపీ అగ్రహారంలో ఉంటున్నారు. నిందితుడు కాకరదాసు (25) జేపీ అగ్రహారంలో మోటార్ మెకానిక్‌గా ఉండేవాడు. 2014 జూలై 7న బాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ బాలికకు మాటలు రాకపోవడంతో సైగలు ద్వారా విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. అర్థం చేసుకున్న తల్లి జరిగిన అన్యాయాన్ని గ్రామ పంచాయతీలో విన్నవించుకున్నారు. కేసు పోలీస్ స్టేషన్ చేరకుండా ఉండడానికి గ్రామ పెద్దలు బాలిక తల్లిదండ్రులకు రూ.5,000కు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. వారు అందుకు అంగీకరించకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై సెక్షన్లతో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

నీతి ఆయోగ్ సమావేశానికి వీఎంఆర్‌డీఏ జేసీ

విశాఖ సిటీ: పట్టణాల ఆర్థికాభివృద్ధిపై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో బుధవారం జరిగిన వర్క్‌షాప్‌నకు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ హాజరయ్యారు. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో నీతి ఆయోగ్ ముంబై, సూరత్, వారణాసి నగరాలతో పాటు విశాఖకు కూడా ఆర్థిక ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించింది. ముందు పైలెట్ ప్రాజెక్టుగా ఈ నాలుగు నగరాలకు ప్రణాళికను సిద్ధం చేసిన అనంతరం మరో 16 నగరాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'గ్రోత్ హబ్‌గా పట్టణ ప్రాంతాలు' అనే అంశంపై నీతి ఆయోగ్ ఢిల్లీలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో నగరానికి ఆర్థిక ప్రణాళిక రూపొందించే పలు అంశాలపై, అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ వర్క్‌షాప్‌నకు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్లానింగ్ అధికారి కిశోర్ హాజరయ్యారు.



నీతి ఆయోగ్ వర్క్‌షాప్‌పై హాజరైన వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్

కానిస్టేబుల్ ఎక్కడ?



కానిస్టేబుల్ విధులకు హాజరు కాలేదని నోటీస్ బోర్డులో రాసి ఉంచిన దృశ్యం

సీతమ్మధార: '3046' కానిస్టేబుల్ నాట్ రిపోర్టింగ్.. ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్‌స్టేషన్ నోటీస్ బోర్డులో ఏడాదిగా ఇలా దర్శనమిస్తోంది. అయితే ఆయన ఎక్కడున్నారు? అనే ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. వివరాలివీ.. నగరంలోని నాలుగవ పట్టణ క్రైం పోలీస్‌స్టేషన్‌కి పీఎం పాలెంలోని నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆర్.వెంకటరావు(పీసీ 3046)ను బదిలీ చేశారు. ఇది జరిగి సుమారు ఏడాది అవుతున్నా.. ఆయన మాత్రం విధుల్లో చేరకపోవడం గమనార్హం. అసలే క్రైం విభాగానికి సిబ్బంది కొరత ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన క్రైం ఎస్‌ఐలు.. కానిస్టేబుల్ వెంకటరావు ఇంకా విధుల్లో చేరలేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. కాగా.. ఈ కానిస్టేబుల్ ఇంకా విధుల్లో చేరలేదంటూ ఫోర్త్‌టౌన్ క్రైం స్టేషన్ ఆవరణలోని నోటీసు బోర్డులో రాసి ఉంది. మరి వెంకటరావు ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నట్లు.?

'న్యాయవాదుల వివరాలు నమోదు చేయాలి'

విశాఖ లీగల్: సుప్రీం కోర్టు, ఇతర న్యాయస్థానాల్లో సాఫ్ట్‌వేర్‌ను 4.0 వెర్షన్‌కి మార్చినట్లు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులందరి వివరాలను నమోదు చేసి.. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా న్యాయవాద సంఘాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

గాలిలో తేలిపోదాం..
హాట్ ఎయిర్ బెలూన్ ప్లేకు ట్రయల్ రన్ పూర్తి



ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో హాట్ ఎయిర్ బెలూన్ ప్లే అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అరకు పద్మాపురం గార్డెన్‌లో విజయదశమి రోజున ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతి కోసం నిర్వాహకులు ఎదురు చూస్తున్నారు. పర్యాటకులు గాలిలో విహరించి అరకులోయ పరిసర అందాలను వీక్షించే వీలు కలుగుతుంది. మంగళవారం వరకు ట్రయల్ రన్ నిర్వహించామని, ఒక్కొక్క వీక్షకుడు పది నిమిషాలు విహరించేందుకు నుంచి రూ.1,500 వసూలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

హాట్ ఎయిర్ బెలూన్ ప్లే అందుబాటులోకి వస్తే 200 మీటర్ల ఎత్తులో విహరిస్తూ ప్రత్యేక అనుభూతి పొందవచ్చు. ఇక్కడికి సమీపంలోని జైపూర్ జంక్షన్ ప్రాంతంలో కూడా త్వరలో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో పారా మోటరింగ్ కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా పీవో అభిషేక్ ట్రయల్ రన్ నిర్వహించారు.
– అరకులోయ టౌన్

మేఘాల్లో విహరిద్దాం..
లంతంపాడు, దిబ్బవలస ప్రాంతాల్లో అందాల కనువిందు



ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన అరకులోయ ప్రాంతంలో మరో మేఘాల కొండ వెలుగులోకి వచ్చింది. మండలంలో సిర్గం పంచాయతీ పరిధిలో లంతంపాడు, దిబ్బవలస గ్రామాల సమీపంలో ఎత్తయిన అటవీ ప్రాంతంలో మంచు అందాలు పాల సముద్రాన్ని తలపిస్తున్నాయి. వంజంగి హిల్స్‌లో మాదిరిగానే ఇక్కడ కూడా కనువిందు చేస్తున్నాయి. ఇక్కడికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఉండటంతో ఈ అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.
– అరకులోయ రూరల్

చీటీల పేరుతో రూ.20 కోట్లకు టోకరా
భార్యాభర్తలపై చీటింగ్ కేసు నమోదు

తగరపువలస: తగరపువలసకు చెందిన భార్యాభర్తలు వంగపండు రోజా, శ్రీనివాసరావులపై భీమిలి సీఐ బి.సుధాకర్ బుధవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ చంద్రరావు వీధికి చెందిన కొసన సత్యవతి ఈ మేరకు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల కిందట రోజా, శ్రీనివాసరావులు చిప్పాడ వెళ్లి తాము చీటీలు, లక్కీ డ్రాలు స్కీమ్‌లు, వరలక్ష్మి స్కీమ్‌లు వేస్తున్నామని.. వీటి ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరుస్తామని గ్రామస్తుల నుంచి డబ్బులు వసూలు చేశారు. అయితే వారికి ఇప్పటి వరకు డబ్బులు, వడ్డీలు తిరిగి చెల్లించలేదు. పంచాయతీ వాసులను నమ్మించి సుమారు రూ.1.35 కోట్ల వరకు వసూలు చేసినట్టు బాధితురాలు ఫిర్యాదు చేశారు.



బాధితులకు నిర్వాహకులు ఇచ్చిన స్కీమ్ కార్డు

కాగా ఈ విషయం తెలుసుకున్న భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతానికి చెందిన వందల మంది బాధితులు బుధవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రోజా, శ్రీనివాసరావు చేతిలో మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పప్పుల చీటీలు, లక్కీ స్కీమ్‌ల పేరుతో ఈ దంపతులు వసూలు చేసి తిరిగి చెల్లించని సొమ్ము రూ.20 కోట్లు పైబడి ఉంటుందని అంచనా. దీనిపై పోలీసులు గురువారం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

పరీక్ష ఫీజు తగ్గించిన ఏయూ
హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు

సీతంపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల వినతికి అధికారులు స్పందించి ఫీజు తగ్గించారు. ప్రస్తుతం ఉన్న సెమిస్టర్ ఫీజులో రూ.450 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు పరీక్ష ఫీజు తగ్గించాలని, ఫీజు చెల్లింపు గడువును నవంబరు 2వ తేదీ వరకు పొడిగించాలని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఫీజును తగ్గిస్తూ వీసీ నిర్ణయం తీసుకోగా.. విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలో ఏయూలో డ్యూయల్ డిగ్రీ విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి పూజకొచ్చి.. అనంతలోకాలకు!
రోడ్డు ప్రమాదంలో కొమరాం వాసి మృతి


వెంకటనాయుడు(ఫైల్)


ఘటనా స్థలంలో మృతుడు వెంకటనాయుడు, క్షతగాత్రుడు

అక్కిరెడ్డిపాలెం: మేనల్లుడికి సంబంధించి అమ్మవారి పూజలో పాల్గొని తిరిగి వెళ్తున్న అతని మేనమామ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలివీ.. గాజువాక జోగవానిపాలేనికి చెందిన ఏదురు వెంకటేష్ భవానీ మాల వేశాడు. బుధవారం పూజ అనంతరం భిక్ష కార్యక్రమానికి పార్వతీపురం జిల్లా కొమరాంకు చెందిన తన మేనమామ కొండ్రు వెంకటనాయుడు (54)ను ఆహ్వానించాడు. ఈ కార్యక్రమానికి హాజరైన వెంకటనాయుడు తిరుగు ప్రయాణంలో కంచరపాలెంలోని తన బంధువులను కలుసుకోవడానికి వెంకటేష్‌తో కలిసి స్కూటీపై బయలు దేరారు. స్కూటీపై పూజ సామగ్రితో గాజువాక నుంచి ఎన్‌ఏడీ వైపు వేగంగా వెళ్తూ.. ఎయిర్‌పోర్టు సమీపంలో వంతెన వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న కొండ్రు వెంకటనాయుడు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీ నడుపుతున్న వెంకటేష్ చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వెంకటేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వెంకటనాయుడు వ్యవసాయం చేస్తుంటారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎరుపెక్కిన ఆకాశం



ఆకాశం బుధవారం సాయంత్రం ఎర్రగా మారి ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. సాధారణంగా నీలంగా కనిపించే ఆకాశం అకస్మాత్తుగా ఎర్రగా మారడంతో స్థానికులు అటువైపు ఆసక్తిగా చూశారు. హెల్త్‌సిటీ ప్రాంతంలో ఈ అద్భుత దృశ్యం కనిపించింది. ఎర్రని కాంతి కొండలపై పడి.. మంచు కప్పినట్లు కనిపించాయి. కొందరు ఈ దృశ్యాన్ని తమ మొబైల్ ఫోన్లలో బంధించారు. - ఆరిలోవ

గంగా భవాని ప్యానల్ విజయం
ప్రశాంతంగా నర్సుల ఎన్నికలు


ఎన్నికల్లో గెలిచిన గంగా భవాని ప్యానల్ అభ్యర్థులు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో టి.గంగాభవాని ప్యానల్ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో రెండు ప్యానల్స్ పోటీ పడగా, గంగాభవాని ప్యానల్ విజయం సాధించింది. కేజీహెచ్‌లోని యూనియన్ బ్యాంక్ పక్కనున్న భవనంలోని నర్సెస్ క్లోక్ రూమ్‌లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీక్రెట్ బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహించారు. 555 మంది ఓటర్లకు గాను 521 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 94 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన టి.గంగా భవానికి 336 ఓట్లు, ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన ఎం.ఇందిరకు 319 ఓట్లు, కార్యదర్శి పదవికి పోటీ చేసిన జీవీఎస్ వరలక్ష్మికి 319 ఓట్లు, కోశాధికారి పదవికి పోటీ చేసిన బుద్ధరాజు వంశీ 329 ఓట్లు పోలయ్యాయి. కార్యవర్గ సభ్యులుగా ఎస్. మోహర్ శాంతి 390 ఓట్లు, వియ్యపు వీనీల 343 ఓట్లు, దాసరి లిల్లీ గ్రేస్ 303 ఓట్లు, గంగా గౌరీ ఎస్ 290 ఓట్లు, టి.పద్మజ 259 ఓట్లతో విజయం సాధించారు. రెండో ప్యానల్‌లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన వి.ఉషారాణికి 195 ఓట్లు, ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన జి.శాంతమ్మకు 165 ఓట్లు, జైతు రవీంద్రనాథ్‌కు 134, జి.పరమేశ్వరికి 69 ఓట్లు, కోశాధికారి పదవికి పోటీ చేసిన ఎన్.ప్రశాంతికి 198 ఓట్లు వచ్చాయి.

తుపానుపై వాల్తేర్ డివిజన్ అప్రమత్తం

తాటిచెట్లపాలెం: దానా తుపాను ప్రభావంతో కురిసే భారీ వర్షాలను, తద్వారా వచ్చే పరిణామాల్ని ఎదుర్కొనేందుకు వాల్తేర్ డివిజన్ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ ఈ పరిస్థితులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారం వివిధ మాధ్యమాల్లో చేరవేస్తున్నారు. వాతావరణ విభాగం నుంచి వచ్చే సమాచారం మేరకు చర్యలు తీసుకునేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాల్ని, సిబ్బందిని నియమించారు. అదనపు కంట్రోల్ రూంలు, హెల్ప్‌డెస్కులు, రిజర్వేషన్ రద్దు, వాపసు కోసం అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు.

హెల్ప్‌లైన్ నంబర్లు
విశాఖపట్నం: 0891-2746330/ 2744619, 87126 41255, 77807 87054
విజయనగరం: 08922-221202, 87126 41260
శ్రీకాకుళం రోడ్: 08942-286213, 286245
దువ్వాడ: 85003 58524
రాయగడ: 06856-223400, 94397 41071

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక


ఐఎంఏ నూతన కార్యవర్గం

మహారాణిపేట: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖ చాప్టర్ అధ్యక్షురాలిగా డాక్టర్ ఐ.వాణి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.పి.జగదీశ్వరరావు, ఎం.సుబ్రహ్మణ్య శర్మ, ఎం.వి.ఎస్.ఎస్.బాపారావు, కార్యదర్శిగా డాక్టర్ ఎం.వి.వి. మురళీమోహనరావు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ వెంకట నారాయణ గౌతమ్, సానబోయిన అప్పలరాజు, వై.ఎల్.నరసింగరావు, జి.రామకృష్ణ, కోశాధికారిగా టి.జె.వాణిశ్రీ, కార్యవర్గ సభ్యులుగా వినీత్ వాద్వా, జి.హనుమంతరావు, టి.జె. జీవన్, శేష చలపతిరావు, నిష్టల శ్రీనివాస్, నరేంద్ర బెండి, సరోజిని జోన్నలగెడ్డ, పి.వెంకటరమేష్ బాబు, బెండి హేమసుందర్, ఎస్.నరసింగరావు, విజయశంకర్, సోమేశ్వరరావు ఎన్నికయ్యారు.

పీరియాడికల్ థ్రిల్లర్ 'క'

దాబాగార్డెన్స్: పీరియాడికల్ థ్రిల్లర్‌గా రూపొందిన 'క'చిత్రం ఈ నెల 31 విడుదలవుతుందని, ప్రేక్షకులు ఈ సినిమాను విజయవంతం చేయాలని హీరో కిరణ్ అబ్బవరం కోరారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను తొలిసారిగా పాన్ ఇండియాలో నటించానని, సుజిత్, సందీప్ రచన, దర్శకత్వంలో సినిమా బాగా వచ్చిందన్నారు. సామ్ సీఎస్ వీనుల విందుగా సంగీతం అందించారని, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదిరిపోతుందన్నారు. హీరోయిన్లుగా నటించిన నయన సారిక, తన్వీరామ్ పాత్రలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. గురువారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. తనకు విశాఖ ఎంతో సెంటిమెంట్ అని కిరణ్ చెప్పారు.

మానసిక ఆందోళనతో వివాహిత ఆత్మహత్య


మేధా మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీతమ్మధార: మానసిక ఆందోళనతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతమ్మధార ప్రాంతంలో నివాసముంటున్న ఎం.మేధా నాగ్(33)కి ఎం.శ్రీకాంత్‌రెడ్డితో 2020 మార్చి 19వ తేదీన వివాహం జరిగింది. మూడేళ్ల పాటు వారు సంతోషంగా ఉన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఉద్యోగరీత్యా 2023లో అమెరికాకు వెళ్లాడు. భార్య మేధానాగ్‌కు వీసా వచ్చాక తీసుకువెళ్లాలని భావించాడు. అయితే వీసాకు సమయం పట్టడంతో ఆమె మానసిక వేదనకు గురైంది. దీంతో బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి ఎం. నగేష్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను మృతురాలి తండ్రితో మాట్లాడారు. భార్యాభర్తల మధ్య ఎటువంటి విభేదాలు లేవని, ఇద్దరూ సంతోషంగానే ఉన్నారని అతను చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండో జాతీయ పోటీలకు ఎంపికలు


ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

తగరపువలస: అమృతసర్‌లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయంలో నవంబరు 12 నుంచి 15 వరకు జరగనున్న అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీలకు బుధవారం ఎంపికలు జరిగాయి. సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సిద్ధార్థ ప్రభుత్వ దంత వైద్యకళాశాలకు చెందిన పి.బ్లెస్సీ నేహా, గుడివాడ హెచ్‌ఎంసీకి చెందిన వి.ప్రియ, సంగివలస అనిల్ నీరుకొండకు చెందిన ఎస్.నేహితారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ బేతిస్, ఏవో శివప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

నివాస ప్రాంతంలో మద్యం షాపు వద్దు
పందిమెట్ట వద్ద స్థానికుల ఆందోళన

టీచర్రోడ్డు: నివాస ప్రాంతం, అందునా గ్రామదేవత ఆలయానికి సమీపంలో వైన్ షాపు ఏర్పాటును నిరసిస్తూ పందిమెట్ట జంక్షన్ వద్ద బుధవారం స్థానికులు ఆందోళనకు దిగారు. నూతన మద్యం పాలసీలో భాగంగా పందిమెట్ట వద్ద వైన్ షాపు ఏర్పాటుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ పాత వారి గ్రామ దేవత ముత్యాలమ్మ దేవాలయం ఉంది. నిత్యం మహిళలు, పిల్లలు తిరుగాడే ప్రాంతం కావడంతో.. ఇక్కడ మద్యం షాపు ససేమిరా వద్దంటూ స్థానికులు నిరసన తెలిపారు. నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణం వల్ల మహిళల మాన ప్రాణాలకు ఇబ్బంది కలుగుతుందని నినదించారు.

ఈవీఎం గోదాం పరిశీలన


రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ: పాత డెయిరీ ఫారం వద్ద హైవేను ఆనుకుని ఉన్న ఈవీఎం గోదాంను బుధవారం కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ సందర్శించారు. ముందుగా రిజిస్టర్‌లో సంతకం చేసి.. తలుపులకు వేసిన సీల్‌ను పరిశీలించారు. గోదాంలోని వీవీ ప్యాట్‌లు, ఈవీఎం యంత్రాలను తనిఖీ చేశారు. గోదాం లోపల, బయట సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్, ఎన్నికల సెల్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించి.. తర్వాత శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమావేశానికి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.110
బ్రాయిలర్ (లైవ్)	: రూ.130
స్కిన్	: రూ.230
స్కిన్‌లెస్	: రూ.240

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

హోంగార్డు నూకరాజుకు సీపీ అభినందనలు


హోంగార్డు నూకరాజును అభినందిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖ సిటీ: జాతీయ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించి విద్యార్థుల ప్రతిభను గుర్తించిన హోంగార్డు జి.నూకరాజును నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. నగర పోలీస్ శాఖలో నూకరాజు హోంగార్డుగా పనిచేస్తూ కిక్ బాక్సింగ్‌లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. అంతేకాకుండా అతని విద్యార్థులు రాష్ట్ర తరపున రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో హోంగార్డు నూకరాజును సీపీ బుధవారం తన చాంబర్‌కు పిలిపించి అభినందించారు.

నేవీ స్థావరం భూసేకరణ వివాదంపై ఎస్పీ సమావేశం


మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: రాంబిల్లి మండలం వాకపాడులో నేవీ ప్రత్యామ్నాయ స్థావరం భూ సేకరణను బంగారమ్మపాలెం మత్స్యకారులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం పరవాడ, నర్సీపట్నం సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారమ్మపాలెం మత్స్యకారుల సమస్యలు సమగ్రంగా తెలుసుకోవాలని, గ్రామాల్లో ఎటువంటి ఉద్రిక్తత లేకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. మత్స్యకారుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, సీఐలు మల్లికార్జునరావు, నరసింగరావు, రామకృష్ణ, కుమారస్వామి, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.